సద్దుమణుగుతున్న నీటి సమస్య

పరిస్థితి సాధారణ స్థాయికి వచ్చే వరకు జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ

విశాఖపట్నం, జననేత న్యూస్: నగరంలో నీటి సమస్య పరిష్కారానికి జీవీఎంసీ చేపట్టిన ప్రత్యేక కార్యాచరణతో నీటి సమస్య సద్దుమణుగుతోందని, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థాయికి వచ్చే వరకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొనసాగించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నీటి సమస్య ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మరో వారం రోజులపాటు జీవీఎంసీ ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. కమిషనర్ టౌన్ సర్వీస్ రిజర్వాయర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి నీటి నిల్వలు, ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లు, సరఫరా వ్యవస్థను పరిశీలించారు. నీటి సరఫరా పర్యవేక్షక ఇంజనీర్ పల్లంరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ తదితర అధికారులతో సమీక్షించి, ఇప్పటివరకు ఉచితంగా ఎన్ని ట్యాంకర్లు సరఫరా చేశారు, ఏయే ప్రాంతాలకు పంపించారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.



"డయల్-ఏ-ట్యాంకర్" బుకింగ్‌లపై ప్రత్యేక పరిశీలన"

"డయల్-ఏ-ట్యాంకర్", జీవీఎంసీ వెబ్‌సైట్ ద్వారా నమోదైన ట్యాంకర్ అభ్యర్థనలు, డెలివరీలు, పెండింగ్ బుకింగ్‌లకు సంబంధించిన రికార్డులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ట్యాంకర్ బుక్ చేసుకున్న రాము అనే వినియోగదారుడితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, బుకింగ్ చేసిన సమయం, ట్యాంకర్ అందిన సమయం, ఆన్‌లైన్‌లో చెల్లించిన మొత్తం, డెలివరీ సమయంలో డ్రైవర్‌కు చెల్లించిన మొత్తం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.